సాక్షి ఒడిశా

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,72,554
బంగారం	06 గ్రాముల 900 మిల్లీ గ్రాములు
వెండి	26 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

\- భువనేశ్వర్/పూరీ



టార్గెట్ నంబర్ 1

పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమంగా నిలిచేలా జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

- 8లో



సత్ప్రవర్తనతో మెలగండి

రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైన వారంతా సత్ప్రవర్తనతో ఉండాలని సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు సూచించారు.

- 8లో

న్యూస్‌రీల్

బీజేపీ ప్రచారం ప్రారంభం



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బరంపురం: సార్వత్రిక ఎన్నికలకు బరంపురం నియోజకవర్గంలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం ఆదివారం ప్రారంభించారు. నగరంలోని గాంధీ నగర్‌లో కున్నుచరణ్ పతి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. మరోవైపు జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం ప్రచారంలో జోరుగా పాల్గొంటున్నారు. అలాగే అధికార బీజేడీ నాయకులు తమ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. ప్రచారంలో భాగంగా వివిధ పార్టీల నాయకుల విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

బిజూ పట్నాయక్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులతో పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు

బరంపురం: స్థానిక బరంపురం క్రీడా మైదానంలో ఆల్ఫా స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 14వ బిజూ పట్నాయక్ మెమోరియల్ ట్రోఫీ ఆల్ ఇండియా ఫెడ్‌లైట్ క్రికెట్-24 టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా, గంజాం బీజేడీ అధ్యక్షుడు డా.రమేష్ చంద్రచావ్ పట్నాయక్, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, బీడీఏ సుభాష్ మహరణలు హాజరయ్యారు. ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు వరకు ఈ పోటీలు జరగనున్నాయి. పోటీల్లో గంజాం, ఫుల్బాణి, కటక్, భువనేశ్వర్, గజపతి జిల్లాలకు చెందిన టీములు పాల్గొంటున్నాయి.

ఇసుక లారీలు సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీలు

జయపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను బొరిగుమ్మ సమితి బిసింగ పైర్ పోలీసులు సీజ్ చేశారు. బొరిగుమ్మ తహసీల్దార్ సవ్యసాచి జెన, బిసింగపూర్ పోలీసు అధికారి సంబిత్ స్వైలు కలిసి ట్రక్కులను పట్టుకున్నట్లు సమాచారం. బొరిగుమ్మ సమితి నుంచి తరచూ సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్, ఛత్తీష్‌గడ్ రాష్ట్రాలకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు రావడంతో పోలీసు, రెవెన్యూ అధికారులు నిఘా పెట్టారు. దీనిలో భాగంగా అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. వాహనాలను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి సీజ్ చేసినట్లు బొరిగుమ్మ తహసీల్దార్ సవ్యసాచి జెన ఆదివారం తెలియజేశారు. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎలుగుబంటి దాడిలో తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న గురుబంద హరిజన్

జయపురం: జయపురం సబ్ డివిజన్ కుంద్రా పంచాయతీ బాఘుగుడ గ్రామంలో ఎలుగుబంటి దాడిలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గురుబంద హరిజన్ (45) ఏదో పనిపై తన గ్రామం నుంచి కుంద్ర గ్రామానికి శుక్రవారం వెళ్లాడు. అనంతరం సాయంత్రం సమయంలో తన గ్రామానికి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో ఒక ఎలుగుబంటి అతడిపై దాడి చేసింది. దీంతో ఎలుగును అతడు ధీటుగా ఎదుర్కొని సుమారు 30 నిమిషాలు పోరాడాడు. ఈ పోరులో గురుబంద తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రమైన గాయాలతో అతి కష్టంమీద ఇంటికి చేరాడు. అతడి పరిస్థితి చూసిన కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని అంబులెన్స్‌లో కుంద్ర కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందిన వెంటనే జిల్లా ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర మఝి, కుంద్ర బ్లాక్ బీజేడీ అధ్యక్షుడు బృందావన మల్లిక్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించారు. అతడికి నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

జయపురం అభ్యర్థిగా ఇందిరా నందో..?

● బీజేడీ అధిష్టానం ఖరారు చేసినట్లు సమాచారం



ఇందిరా నందో



చంద్రశేఖర మఝి

జయపురం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఖరారు చేసేందుకు బీజేడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో గెలిపొందిన వారిలో అభియోగాలు ఉన్న కొంతమందిని పక్కనపెట్టి, కొత్త వారికి అవకాశాలు కల్పిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా కొరాపుట్ జిల్లాలోని 5 ఎమ్మెల్యే స్థానాలకు సంబంధించి, 2 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆ రెండు స్థానాల్లో ఒకటి జయపురం కాగా, రెండోది కోట్‌పాడ్. కొరాపుట్ జిల్లాలో ఏకైక జనరల్ స్థానమైన జయపురంలో డాక్టర్ ఇందిరా నందోను అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇందిరా నందో మాజీ మంత్రి రబినారాయణ నందో సతీమణి. ఆమె కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షురాలు. ప్రస్తుతం జిల్లా మహిళా బీజేడీ నేతగా రబినారాయణ నందోతో కలిసి జయపురంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

మొదటిసారి మహిళ పోటీ..?

జయపురంలో 1952 ఎన్నికల నుంచి 2019 ఎన్నికల వరకు ప్రధాన పార్టీల నుంచి ఒక్క మహిళ కూడా పోటీ చేయలేదు. 2024 ఎన్నికల్లో ఇందిరా నందో పోటీ చేస్తే ఆమె మొదటి మహిళ అవుతుంది. విద్యావంతురాలైన ఆమె మాత్రమే జయపురంలో మరలా బీజేడీ జెండా ఎగురవేయగలదని పార్టీ విశ్వాసంతో ఉంది. ఈసారి ఆమె కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతిని ఓడిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కోట్‌పాడ్‌లో చంద్రశేఖర్ మఝి..!

అలాగే ఎస్సీ స్థానమైన కోట్‌పాడ్‌లో చంద్రశేఖర మఝికి బీజేడీ టిక్కెట్టు ఖరారు చేసినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే అయినటువంటి మాజీమంత్రి పద్మిణీ దియాన్‌ను పక్కనపెట్టి చంద్రశేఖర మఝికి టిక్కెట్టు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి చంద్రశేఖర మఝి కాంగ్రెస్ నుంచి వచ్చిన వ్యక్తి. ఆయన అన్న దివంగత బాసుదేవ్ మఝి 9 సార్లు ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆయన మరణానంతరం అతడి సోదరుడైన చంద్రశేఖర్ మఝి 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్టుపై ఈ స్థానంలో పోటీచేసి విజయం సాధించాడు. అయితే 2019 ఎన్నికల్లో ఆయన బీజేడీ అభ్యర్థి పద్మిణీ దియాన్ చేతిలో ఓటమి చెందారు. అనంతరం కాంగ్రెస్‌ను వీడి బీజేడీ తీర్థం పుచ్చుకున్నారు. అతడికి ఇచ్చిన హామీ మేరకు చంద్రశేఖర్‌కు జిల్లా ఆదివాసీ అభివృద్ధి పరిషత్ స్వతంత్ర అధ్యక్ష పదవి ఇచ్చారు. కోట్‌పాడ్‌లో బలమైన కాంగ్రెస్‌ను ఎదుర్కోవాలంటే సరైన అభ్యర్థి చంద్రశేఖర్ అని గుర్తించిన బీజేడీ అతడికి టిక్కెట్టు ఖరారు చేసిందని సమాచారం. ప్రస్తుత ఎమ్మెల్యే పద్మిణీ దియాన్‌ను ఒకే కుటుంబానికి ఒకే టిక్కెట్టులో భాగంగా పక్కనపెట్టినట్లు తెలుస్తోంది.

'జయపురం జిల్లా ఏర్పాటు చేయాలి'



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: జయపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలని జయపురం జిల్లా కార్యాచరణ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు కొరాపుట్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర శాసనసభలో నూతన జిల్లాల డిమాండ్ జాబితాలో జయపురం లేదని తెలపడం సరికాదన్నారు. జయపురం సబ్ డివిజన్‌లో జయపురం సమితి, బొయిపరిగుడ, బొరిగుమ్మ, కోట్‌పాడ్, కుంద్ర సమితిలు, కోట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్, జయపురం మున్సిపాలిటీలను కలిపి జయపురం జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జయపురం ప్రత్యేక జిల్లాగా ఏర్పడితే సబ్ డివిజన్ ప్రజలకు ఎంతో లబ్ధి కలుగుతుందన్నారు. అధికార వికేంద్రీకరణతో ప్రజలకు పాలన యంత్రాంగం చేరువవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో 5 సమితుల ప్రతినిధులతోపాటు, జయపురం జిల్లా డిమాండ్ కమిటీ సభ్యులు బులుదేవ శర్మ, ప్రకాశ్ మిశ్ర, రమాకాంత రథ్, కమళాకాంత రథ్, గుప్త పాణిగ్రాహి, సతీష్ నందో, షణ్ముఖరావు, జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి డి.మాధవ, జయపురం కళాకార సంఘ ప్రతినిధి మనోజ్ పాత్రో, ధీరెన్ మోహన్ పట్నాయక్, బొయిపరిగుడ ప్రతినిధి బిభు పండ, బొరిగుమ్మ ప్రతినిధి పద్మణ స్వైు, దళిత సమాజ్ ప్రతినిధి యాకబ్ గండ, మానస్వినీ టక్రి తదితరులు పాల్గొన్నారు.

జయపురం ఆస్పత్రికి లక్ష్య అవార్డు



ఆస్పత్రి సిబ్బందిని అభినందిస్తున్న వైద్యాధికారులు

జయపురం: స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ప్రసూతి, మహిళా విభాగానికి లక్ష్య 2022–23 పురస్కారం లభించింది. అలాగే జయపురం సబ్ డివిజన్‌లో బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రి 2021–22 ఏడాదికి సంబంధించి కాయకల్ప గుర్తింపు పొందింది. ఈ మేరకు ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర అస్పత్రి సభాగృహంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కస్తూచరణ్ పాత్రో, జిల్లా హాస్పిటల్ అధికారి డాక్టర్ రవీంద్ర నారాయణ మిశ్ర, జిల్లా ప్రజారోగ్య అధికారి డాక్టర్ అరుణ కుమార్ పాఢీ, జిల్లా కేంద్ర హాస్పిటల్ మేనేజర్ రూపసినీ మధుమిత నాయిక్ తదితరులు పాల్గొన్నారు. ఇలాగే మరింత నాణ్యమైన సేవలు రోగులకు అందించి, మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

పసికందు మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

రాయగడ: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని చెత్తకుప్పలో మగ శిశువు మృతదేహం లభ్యమయ్యింది. ఆదివారం తెల్లవారు జామున స్వీపర్లు పరిశుభ్రం చేస్తున్న సమయంలో చెత్తకుప్ప వద్ద ఒక గోనె సంచిలో శిశువు మృతదేహాన్ని గుర్తించారు. ఇదే విషయమై సదరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహం లభ్యమైన ప్రదేశంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించిన ఒక పేషెంట్ స్లిప్ కూడా కనిపించింది. దానిలో జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీ బామినిపుట్ గ్రామానికి చెందిన భార్యభర్తల పేర్లు ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

పేట్రేగుతున్న దొంగలు



డబ్బులు పోవడంతో విలపిస్తున్న జెమా

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మలో దొంగలు పెట్రేగుతున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోకపోవడం, సీసీ కెమేరాలు పనిచేయకపోవడంతో యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. బొరిగుమ్మ సమితి జిలిమిలి గ్రామానికి చెందిన జెమా అనే మహిళ తన భర్తతో కలిసి బొరిగుమ్మ ఎస్‌బీఐలో రూ.3 లక్షలు విత్ డ్రా చేశారు. ఆ డబ్బును ఒక బ్యాగ్‌లో ఉంచి తిరిగి ఆటోలో తమ గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలో బొరిగుమ్మ పంచాయతీ సమితి కార్యాలయం సమీపంలో ఏదో పని ఉండి భార్యాభర్తలు ఆటో దిగారు. దీంతో ఆ సమయంలో ఆటోలో ఉన్న డబ్బుల బ్యాగ్‌ను దొంగలు దోచుకుపోయారు. భార్యాభర్తలు ఇద్దరూ ఆటో వద్దకు వచ్చి చూడగా ఆటోలో ఉంచిన డబ్బుల బ్యాగ్ కనిపించకపోవడంతో లబోదిబోమన్నారు. వచ్చే నెల 3వ తేదీన జరగనున్న తమ కుమారుడి పెళ్లి కోసం డబ్బులు బ్యాంక్ నుంచి తీసినట్లు విలపించారు. అనంతరం బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బొరిగుమ్మలో 31 సీసీ కెమేరాలు ఉన్నా, అవి పనిచేయకపోవడం వలన దొంగలు తప్పించుకోగలుగుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● రాష్ట్ర బ్రాహ్మణ మహా సంఘం అధ్యక్షుడు సదానంద దీక్షిత్



ప్రసంగిస్తున్న దీక్షిత్ వేదికపై మదన్ పాఢి తదితరులు

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, అభివృద్ధికి తోడ్పడాలని రాష్ట్ర బ్రాహ్మణ మహా సంఘం అధ్యక్షుడు డాక్టర్ సదానంద దీక్షిత్ కోరారు. స్థానిక యుజీఎంఐటీ సమావేశం మందిరంలో రాష్ట్రస్థాయి 21వ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అనేక రాష్ట్రాల్లో బ్రాహ్మణ అభివృద్ధికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నాయని తెలియజేశారు. మన రాష్ట్రంలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పేద బ్రాహ్మణ కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయని, పిల్లలను చదివించుకోలేని దీనస్థితిలో కొట్టుమిట్టుడుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి రిజర్వేషన్లు లేకపోవడం, ప్రభుత్వ సహకారం అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారన్నారు. అదేవిధంగా పూరీలో బ్రాహ్మణ విద్యార్థుల కోసం వేద పాఠశాల నిర్మించాలని కోరారు. పూరీలో త్వరలో బ్రాహ్మణ భవనం నిర్మించేందుకు సన్నాహాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. దీని నిర్మాణం పూర్తయితే పూరి మహాపుణ్య క్షేత్రాన్ని సందర్శించేందుకు వచ్చిన బ్రాహ్మణులకు ఉచితంగా వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మరికొద్ది రోజుల్లో రాజధాని భువనేశ్వరలో బ్రాహ్మణ మహాసభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మదన్ మోహన్ పాఢి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంజన్ కుమార్ రౌతో, రాష్ట్ర కో–ఆర్డినేటర్ సింహాచల్ మహాపాత్రో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథ పాఢి, వర్కింగ్ ప్రెసిడెంట్ కిషోర్ చంద్ర పండ, శక్తి వాహిని మహిళా సంఘం అధ్యక్షురాలు శుభ్రాపండ, ఆంధ్రాకు చెందిన శ్రీకాకుళం జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రమేష్ చంద్ర సాహు, విశాఖపట్నం సంఘం అధ్యక్షుడు విజయ్ కుమార్ అధికారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘం వార్షిక సంచికను ఆవిష్కరించారు.



సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

ఘనంగా కలబంద అమ్మవారి జాతర



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి ముకుందపూర్ పంచాయతీ పరిధి హతికొంబా గ్రామంలో కలబంద అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతరను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి వేళ సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, తాము వేసిన పంటలు సస్యశ్యామలంగా పండాలని ఈ ప్రాంత ప్రజలు అమ్మవారిని పూజిస్తారు. ప్రతీ రెండేళ్లకు ఒకసారి ఈ జాతర నిర్వహిస్తారు.



పూజలందుకుంటున్న కలబంద అమ్మవారు

భారీగా గంజాయి స్వాధీనం



బరంపురం: గచ్చపడా పోలీసులు సీజ్ చేసిన 250 కిలోల గంజాయి

బరంపురం: గంజాం, కొందమాల్ జిల్లాల పోలీసు అధికారులు శని, ఆదివారం రెండు రోజులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అక్రమంగా రవాణా చేస్తున్న 323 కిలోల గంజాయిని సీజ్ చేశారు. కొందమాల్ ఎస్పీ సుబేంద్ కుమార్ పాత్రో తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని బల్లిగుడా అటవీ ప్రాంతం నుంచి బరంపురం వైపు వస్తున్న వ్యాన్, మూడు బైకుల్లో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు ఎక్సైజ్ అధికారులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో గచ్చపడా పోలీసు అధికారులు కళింగా ఘాటి వద్ద మూడు రోడ్ల జంక్షన్‌లో కాపు కాశారు. అదే సమయంలో గంజాం సరిహద్దులోకి వస్తున్న వ్యాన్, 3 ద్విచక్ర వాహనాలపై దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా 20 బస్తాల్లో తరలిస్తున్న 250 కిలోల గంజాయితో పాటు వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అదే విధంగా గంజాం జిల్లా దిగపండి పోలీసులు డెంగపదర జంక్షన్‌లో అనుమానంతో ఒక ఆటోపై దాడులు జరిపి 5 బస్తాల్లో 73 కిలోల గంజాయితో పాటు ఆటో సీజ్ చేశారు. అలాగే ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఐఐసీ అధికారి రంజిత్ కుమార్ మున్ని తెలియజేశారు.

రాయగడ: రాయగడ నుంచి ముంబాయికి అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఎక్సైజ్ అధికారి అభిరాం బెహర ఆదేశాలు మేరకు సదరు ఎస్ఐ సత్యనారాయణ దాస్, దినేష్ కుమార్‌లు ఆదివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో స్థానిక రైల్వేస్టేషన్‌లో అనుమానస్పదంగా కనిపించిన నలుగురిని ఆపి తనిఖీలు నిర్వహించారు. దీంతో వారి బ్యాగుల్లో 60 కిలోల గంజాయి పట్టుబడింది. సుమారు రూ.6 లక్షల విలువ చేసే ఈ గంజాయిని ముంబాయికి తరలించేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. అరెస్టైనవారిలో జిల్లాలోని గుడారి సమితి సర్గిగుడకు చెందిన మిలాన్ సింగ్ (23), బొబితా గంట (29), ప్రాచి కొరడ (36), కందమాల్ జిల్లా దారింగిబడి ప్రాంతానికి చెందిన సచిన్ నాయక్ (24)లు ఉన్నట్లు తెలియజేశారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకి తరలించారు.



బరంపురం: అరెస్టైనవారిని చూపిస్తున్న దిగపండి పోలీసులు



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు

క్లుప్తంగా

నీటి సంపులో ఎలుగు పిల్ల



నీటిలో పడి ఉన్న ఎలుగుబంటి పిల్ల

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం శివరాంపురం గ్రామ సమీపంలో గల కొండ ప్రాంతంలో ఉన్న ఒక నీటి సంపులో ఆదివారం ఉదయం ఒక ఎలుగు బంటి పిల్లను స్థానికులు గుర్తించారు. గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు అటుగా వెళ్తున్న సమయంలో ఆ నీటి సంపు నుంచి అరుపులు వినిపించడంతో వెళ్లి చూడగా ఎలుగు పిల్ల కనిపించింది. దీంతో ఆ గ్రామస్తులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి రక్షించారు.

అట్టహాసంగా కమ్మసిగడాం జాతర



పూజలందుకుంటున్న మహాలక్ష్మి తల్లి

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారి కల్యాణ క్రతువుతోపాటు సాంస్కృతిక, పౌరాణిక ప్రదర్శనలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జేఆర్ పురం సీఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో సుమారు 150 మందితో ఆరుగురు ఎస్‌ఐల సమక్షంలో జాతర బందోబస్తు ఏర్పాటు చేశారు.

అరసవల్లిలో మాఘ మాస ప్రత్యేక పూజలు



క్షీరాన్నం వండుతున్న మహిళలు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం మాఘమాస ప్రత్యేక పూజలు జరిగాయి. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణి ఒడ్డున పిడకల పొయ్యిలపై మహిళలు క్షీరాన్నాన్ని వండి స్వామికి ప్రసాదంగా సమర్పించారు. ఇతరజిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనంతో పాటు ఉచిత దర్శనానికి వీలుగా భక్తులకు క్యూలైన్లలో మంచినీరు, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయించారు. అలాగే పాలను కూడా అందజేయడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ. 2,92,300, లడ్డూ పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.60 లక్షలు, విరాళాల ద్వారా రూ.1,57,741 వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

కూర్మనాథుని సన్నిధిలో అడిషనల్ డీజీపీ



శ్రీకూర్మనాథుని సన్నిధిలో అడిషనల్ డీజీపీ రవిశంకర్

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుడిని అడిషనల్ డీజీపీ ఎ.రవిశంకర్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్లపార్కు, రెండు ధ్వజస్తంభాలు, ఆకుపసర చిత్రాలను సందర్శించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు క్షేత్రమహాత్యాన్ని తెలియజేసి, చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

పైపుల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



కాలిపోయిన పైపులు

పొందూరు: మండలంలోని రాపాక కూడలికి సమీపంలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ పక్కనే ఉన్న శ్యామల పైపుల ఇండస్ట్రీలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో వెంటనే అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించగా సకాలంలో చేరుకుని మంటలను పూర్తిగా అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్షలు విలువైన రసాయనాలతో పాటు పైపులు, ప్యానల్ బోర్డులు, విలువైన సామగ్రి కాలిపోయాయి. రసాయనాలు మండటంతో మంటలను ఆపడం కష్టమైంది. దట్టమైన మంటలు వ్యాపించి అగ్నిమాపక సిబ్బందికి ఊపిరి ఆడలేదు. అయితే ఎలాంటి ప్రాణహాని లేకుండా మంటలను నిలువరించారు.

టార్గెట్ నంబర్ 1

- టెన్త్ ఉత్తీర్ణతలో రాష్ట్రంలో మొదటి స్థానం లక్ష్యంగా అడుగులు
- విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి
- మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఎప్పటికప్పుడు హెచ్‌ఎంలు, సబ్జెక్ట్ టీచర్లకు దిశానిర్దేశం



స్టడీ హవర్స్‌లో నిమగ్నమైన జెడ్పీహెచ్‌స్కూల్ సాకిపల్లి (టెక్కలి మండలం) విద్యార్థులతో హెచ్‌ఎం అనూరాధ

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమంగా నిలిచేలా జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేస్తున్నారు. మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా శ్రీకాకుళం జిల్లాను ఊరిస్తూ వస్తున్న టాప్ ర్యాంకును ఈ ఏడాది ఎలాగైనా సాధించేలా అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు.

టార్గెట్ నెంబర్ వన్ ప్లేస్..

టెన్త్ పరీక్షలు వస్తున్నాయంటే విద్యార్థుల్లో ఒకటే టెన్షన్.. అయితే వారు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఉండేలా ముందు నుంచే ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు జిల్లా విద్యాశాఖ అధికారులు. పాఠశాల విద్య ఉన్నతాధికారులు, గత కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా దిశా నిర్దేశం చేశారు. 2022లో విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రెండోస్థానంలో నిలవగా.. జిల్లాల విభజన తర్వాత 2023లో వెలువడిన ఫలితాల్లోను శ్రీకాకుళం జిల్లా రెండోస్థానంలో నిలిచింది. దీంతో ఈ ఏడాది టార్గెట్.. నంబర్ వన్ సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం ఆరంభం నుంచి కృషి చేస్తున్నారు. డీఈఓ ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేస్తున్నారు.

వెనుకబడిన వారిపై ప్రత్యేక ఫోకస్

ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు. ప్రతిరోజు ప్రభుత్వ బడుల్లో ఉదయం 8.30 నుంచి 9.15 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని డైలీ ఆన్‌లైన్ టెస్టులను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 9.15 నుంచి 4 గంటల వరకు ఉన్న సమయాన్ని రెండేసి పీరియడ్స్ చొప్పున నాలుగు సబ్జెక్టులకు కేటాయిస్తున్నారు. జనవరి 2 నుంచి మొదలైన ఈ డైలీ టెస్టులు మార్చి 15వ తేదీ వరకు జరుగుతాయి. మొత్తం 20 మార్కులకు జరిగే 130 మోడల్ టెస్టు పరీక్షలు జరుగుతాయి. రోజుకు నాలుగు సబ్జెక్టులో వారి ప్రతిభను గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏ, బి గ్రేడ్‌లో ఉండే తెలివైన విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు లేదా ఇంటి వద్దే చదివించి మరుసటి రోజు వారితో పరీక్ష రాపించడం చేస్తున్నారు. ఇలా చేయటం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని డీసీఈబీ సెక్రటరీ గెట్లాపు రాజేంద్రప్రసాద్ చెబుతున్నారు.

మొదటి స్థానమే లక్ష్యంగా..



శ్రీకాకుళం జిల్లా గత కొన్నేళ్లుగా పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయి రెండోస్థానంలో నిలుస్తూ వస్తోంది. కానీ ఈ ఏడాది మొదటి స్థానమే లక్ష్యంగా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. అనేక కార్యక్రమాలను, ప్రత్యేక తరగతులను చేపడుతున్నాం. ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ ఉత్తీర్ణతను మరింత మెరుగు పడేలా ఫోకస్ చేస్తున్నాం.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం

పాము కాటుతో రైతు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని చిన్న బొరిగివలసలో రైతు పొన్నాన నాగేశ్వరరావు (53) పాము కాటుకు గురై మృతి చెందారు. ఆయన శనివారం ఉదయం చోడి పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. చాలాసేపటి వరకు ఆయనను ఎవరూ గమనించలేదు. ఎప్పటికీ భర్త ఇంటికి రాక పోవడంతో ఆయన భార్య అన్నపూర్ణ వెళ్లి పరిశీలించగా నాగేశ్వరరావు పొలంలో అచేతనంగా పడి ఉన్నారు. దీంతో స్థానికుల సాయంతో ఆయనను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోయింది. నాగేశ్వరరావుకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి సంతోషి కుమారికి వివాహం కాగా కుమారుడు వెంకటేశ్వరరావు చదువుకుంటున్నాడు. నాగేశ్వరరావు మృతికి పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



ఇప్పిలి కృపారావు (ఫైల్)

గార: గృహప్రవేశం కోసం షామియానా బిగిస్తుండగా, ఇనుప గొట్టం పైనున్న విద్యుత్ లైనుకు తగిలి షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన శ్రీకూర్మంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీకూర్మం సచివాలయం ఎదురుగా ఉన్న వీధిలో సోమవారం గృహప్రవేశం జరగనుండగా, ఆదివారం మధ్యాహ్నం వేళలో సప్లయర్సు పనివారు ముందుగా పెండెల్ బిగించేందుకు ప్రయత్నించారు. ఇంటి ఎదురుగా ఉన్న రోడ్డు వద్ద ఇనుప పైపు నిలబెట్టే ప్రయత్నం చేయగా మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్‌లైను తగిలి వర్కర్ ఇప్పిలి కృపారావు (22) అక్కడికక్కడే మృతిచెందారు. కృపారావు సొంత ఊరు ఇప్పిలి గ్రామం కాగా, తల్లితండ్రులు కొన్నేళ్ల కిందట బతుకుతెరువు కోసం శ్రీకూర్మం మెయిన్‌రోడ్‌కు వచ్చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు.

హైదరాబాద్‌లో హిరమండలం యువకుడు..



కొల్లిశంకరరావు (ఫైల్)

హిరమండలం: భగీరథిపురం కాలనీకి చెందిన కొల్లి శంకరరావు(26) హైదరాబాద్‌లో పనిచేస్తూ ఈ నెల 17న విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భగీరథిపురం కాలనీ గ్రామానికి చెందిన శంకరరావు హైదరాబాద్ కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. లోన్ కన్సల్టెన్సీ పేరుతో అక్కడే పని చేస్తున్నాడు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్యాలయం వద్ద బ్యానర్ ఏర్పాటు చేసేందుకు పనిచేస్తుండగా హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతి చెందాడు. పోలీసులు శవ పంచనామా చేసి మృతదేహాన్ని అప్పగించారని మృతుడి సోదరుడు నాగరాజు తెలిపారు.

ఖురాన్ పఠనంతో జీవితం సాఫల్యం

- జిల్లా చరిత్రలో తొలిసారి ఖురాన్ డిగ్రీ అందుకున్న విద్యార్థులు



ఖురాన్ డిగ్రీ అందుకున్న విద్యార్థులతో ముస్లిం పెద్దలు

శ్రీకాకుళం కల్చరల్: ఖురాన్ పఠనంతో జీవిత సాఫల్యం కలుగుతుందని ముఫస్సిరుల్ ఖురాన్ హజ్రత్ మౌలానా డాక్టర్ సయ్యద్ రషీద్ నసీమ్ అన్నారు. జిల్లా చరిత్రలోనే తొలిసారిగా చంపా వీధిలోని చంప మసీద్ మదరసాలో ఐదుగురు విద్యార్థులు హఫీజ్ ఎ ఖురాన్ డిగ్రీని సాధించారు. ఈ సందర్భంగా ముస్లిం ఇమామ్‌లు దస్తర్ బందీ కార్యక్రమాన్ని ఆదివారం టౌన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో నిజాయితీగా జీవించడం ఖురాన్ నేర్పుతుందని వివరించారు. మదరసా ద్వారా మనిషికి మానవత్వం, మంచితనం నేర్పుతారని చెప్పారు. ఈ ఐదుగురు విద్యార్థులు ఖురాన్‌ను గుండెల్లో దాచుకున్నారని, ఎవరికి ఎప్పుడు కావాలన్నా వినిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ ఏడాది మదరసాలో 35మంది విద్యార్థులు చేరగా వారిలో ఐదురుగు ఖురాన్ పూర్తిస్థాయిలో కంఠస్తం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు అబ్దుల్ వాహిద్, మహ్మద్ సాహెబ్, మహ్మద్ ఉమర్, మహ్మద్ నదీమ్, మహ్మద్ అమీర్‌లను ఇమామ్‌లను అభినందించారు.

కార్యక్రమంలో మౌలానాలు హమ్మద్ ఇలియాజ్, అహ్మద్ ముఖ్‌బుల్, హుస్సేన్ అహ్మద్, అబ్దుల్ కలామ్, హాజీ షానవాజ్, మహిబుల్లా ఖాన్, మీర్ సాధిఖుల్లా, అమీరుల్లాబేగ్, బోటు, సయ్యద్ జలాల్, ఎం.ఎ.బేగ్, షాన్, డాక్టర్ అదీబ్ హసన్, అబ్దుల్ రెహమాన్, బొబ్బిలి హుదా ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు మహ్మద్ రఫీ, హమీద్ ఇంతియాజ్, బాబ్జీ, అక్బర్, షాదీఫ్, జిలానీ, ముజీబ్, హాజీ సర్పరాజ్, ఆర్టీసీ భాషా, హాజీ అమీరుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

జిహ్వా 'చేప'ల్యం తీరేలా..



ఇవి చేపల వాటాలు. పలాస మండలం మోదుగులపుట్టి గ్రామంలో ప్రతి ఇంటా చేపలకూర వండుకునే సంప్రదాయాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువులో చేపలు పట్టి 118 వాటాలు వేసి ప్రతి ఇంటికీ పంపించారు. ఇది ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. ఇప్పటికీ దాన్ని పదిలంగా కొనసాగిస్తున్నారు.

– కాశీబుగ్గ

జోరుగా రైల్వే ట్రాక్ మరమ్మతులు



ట్రాక్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: నౌపడ నుంచి గుణుపూర్ వైపు వెళ్లే రైల్వే ట్రాక్ మరమ్మతులు పనులు శరవేగంగా చేస్తున్నారు. కొద్దిరోజులుగా రైల్వే ట్రాక్‌ను పరిశీలించి వాటిని మరమ్మతు చేస్తున్నారు. రానున్న వేసవి దృష్ట్యా ట్రాక్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని, వేగంగా ట్రాక్‌తో పాటుగా ట్రాక్ కింద ఉండే సిమ్మెంట్ దిమ్మలను సైతం మరమ్మతులు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. అలానే రైల్వే ట్రాక్‌కు ఇరువైపుల రాళ్లను సైతం నింపుతూ శరవేగంగా పనులు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని తలగాం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఎదురెదురుగా వెళ్తున్న రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. తలగాం గ్రామానికి చెందిన కె.తవిటినాయుడు అనే వ్యక్తి తన బైక్‌పై టెక్కలి వైపు వస్తున్నారు. తలగాం గేటు నుంచి గ్రామంలోకి పి.భార్గవ్, భవాని శంకర్ అనే ఇద్దరు మరో బైక్‌పై వెళ్తుండగా తలగాం సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో తవిటినాయుడు తలకు తీవ్రగాయాలు కాగా.. భవానీ శంకర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. భార్గవ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గాయపడిన ముగ్గురు వ్యక్తులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి తీవ్ర గాయాలైన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గాయపడిన తవిటినాయుడు ప్రభుత్వ డిగ్రీకళాశాల అవరణలో క్యాంటీన్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చెయనున్నట్లు తెలిపారు.

దాడి కేసులో ఆరుగురికి 14 రోజులు రిమాండ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మాజీ సర్పంచ్ జరుగుళ్ల శంకరరావుపై హత్యాయత్నం కేసులో మొత్తం ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి, శ్రీకాకుళం కోర్టులో ఆదివారం హాజరుపరిచారు. వీరికి 14 రోజులు రిమాండ్ విధించారు. జేఆర్ పురం సీఐ జి.రామచంద్రరావు, ఎస్‌ఐ చిరంజీవి ఈ కేసును దర్యాప్తు చేశారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిని మొదటి నిందితునిగా శనివారం అరెస్టు చేయగా, ఆదివారం మరో ఐదుగురుని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఎచ్చెర్లకు చెందిన నేతింటి సత్యనారాయణ, బొంతలకోడూరుకు చెందిన పంచిరెడ్డి కైలాస్, శ్రీకాకుళం పట్టణం గుజరాతీపేటకు చెందిన అలబాన మణి, శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడుకు చెందిన కలగ ఉమామహేశ్వరరావు, కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లుకు చెందిన సీపాన లక్ష్మణరావులు ఉన్నారు. వీరికి నోటీసులు అందజేసి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఫరీదుపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిన అనంతరం పోలీసులు అరెస్టులు చేశారు.

నిద్దాలమ్మా.. కాపాడమ్మా



ముర్రాటలు తీసుకువెళ్తున్న భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారి నిజరూపం

నిద్దాం గ్రామంలో గల నిద్దాలమ్మ తల్లి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తుంతా ముర్రాటలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు, హోమాలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

– జి.సిగడాం

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైన వారంతా సత్ప్రవర్తనతో ఉండాలని సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం, కవిటి మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలో రౌడీషీట్లుగా నమోదైన వారితో ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వారితో మాట్లాడుతూ.. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగిన వారిపై రౌడీషీట్లను తొలగిస్తామని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్లను తెరుస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లతో సత్ప్రవర్తనతో మెలగుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ, రూరల్ ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు, కవిటి ఎస్‌ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో మేధాశక్తి పెరగాలి'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: విద్యార్థుల మేధాశక్తి పెంచడానికి టాలెంట్ టెస్టులు ఎంతో అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం తరపున ఆదివారం స్థానిక గురజాడ విద్యా సంస్థల్లో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మక పెరగడానికి ఇలాంటి మేధోత్సవం ఉపయోగపడుతుందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి మాట్లాడుతూ జిల్లాశాఖ ఫిజిక్స్ ఫోరం వినూత్న రీతిలో అద్భుతమైన కార్యక్రమాలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ చైర్మన్ జి.రాజేంద్రప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి కుమారి స్వామి, ప్రధానోపాధ్యాయ సంఘం ప్రతినిధులు, జనరల్ సెక్రటరీ రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం జిల్లాస్థాయి నైపుణ్యాభివృద్ధి పరీక్షల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఆదిత్యుడ్ని దర్శించుకున్న విశాఖ సిటీ పోలీస్ కమిషనర్



పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో రమేష్‌బాబు



శేషాచలానికి జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు

అరసవల్లి: మాఘ మాసం రెండో ఆదివారం సందర్భంగా పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు అరసవల్లి సూర్యనారాయణస్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వారికి ప్రత్యేకంగా వేదాశీర్వచనాన్ని అందజేసి తీర్థప్రసాదాలను స్వామివారిని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ తొలిసారిగా ఆదిత్యుడ్ని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను ఆయనకు శంకరశర్మ వివరించారు. ఈయన వెంట బెహరా గిరిపట్నాయక్ తదితరులున్నారు. అలాగే విజయవాడ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం కూడా తొలిసారిగా స్వామివారిని దర్శించుకున్నారు. సౌత్‌సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారి, ఐఆర్‌ఎస్ అధికారి ఉన్నం అక్కిరెడ్డి కూడా ఆదిత్యున్ని దర్శించుకొని పూజలు చేశారు. వీరికి ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు.

భక్తితో సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

గార: జొన్నలపాడు కాలనీలో రామమందిర ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పురోహితులు దార్లపూడి కామేశ్వరశర్మ, బ్రహ్మశ్రీ ఆరవెల్లి బాలభాస్కర శర్మ, మావుడూరి మోహనశర్మల ఆధ్వర్యంలో సీతమ్మ తల్లి ప్రీతి కోసం మహిళలు కుంకుమార్చనలు చేశారు. ఉదయం ఆవాహిత హవనములు, సూర్యనమస్కారములు, మహాన్యాసపూర్వక మహాలింగార్చనాదులు జరిగాయి. సోమవారం ఉదయం ప్రతిష్ట, దర్పణ, నిజరూప దర్శనం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

సంతకవిటి: రాజాంలోని మండలసమాఖ్య కార్యాలయంలో ప్రొడక్షన్ కెమిస్ట్, సేల్స్ సూపర్‌వైజర్స్, సైట్ సూపర్‌వైజర్స్ పోస్టులకు సీడాప్, వెలుగు ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహి స్తున్నట్లు ఏపీఎం సీతారాం ఆదివారం తెలిపారు. హైదరాబాద్, విశాఖపట్నంలలో ప్రొడక్షన్ కెమిస్ట్‌కు బీఎస్సీ కెమిస్ట్రీ, బీజెడ్‌సీ పాస్ లేక ఫెయిల్, వయస్సు 18 నుంచి 27 సంవత్సరాలు, కలిగి ఉండాలి. హైదరాబాద్, విశాఖపట్నం, విజయనగరంలలో సేల్స్ సూపర్‌వైజర్స్ పోస్టులకు ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో చదివి వయస్సు 18 నుంచి27 సంవత్సరాలు కలిగి ఉండాలి. ఏదైనా డిగ్రీ చదివిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని, సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్‌లతో ఉదయం 10 గంటలకు రాజాంలోని వెలుగు కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గజపతినగరం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో గల పొట్టావారి వీధిలో పురుగు మందు తాగేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజపతినగరంలో నివాసం ఉంటున్న బొద్దూరు నారాయణరావు(59) ఆరోగ్యం బాగాలేక మనస్తాపానికి గురై ఈనెల 15వ తేదీన పురుగు మందు తాగేశాడు. విషయం గమనించిన భార్య సుందరమ్మతో పాటు బంధువులు విజయనగరం సర్వజన ఆస్పత్రికి అదే రోజు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యసేవలు పొందుతూ శనివారం రాత్రి మృతి చెందగా ఫిర్యాదు మేరకు ఎస్సై యు.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా ధ్వంసం



పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్న పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు

కురుపాం: వివిధ కేసుల్లో పట్టుబడిన 857.6 లీటర్ల సారాను మండల కేంద్రంలోని పాత ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆదివారం ధ్వంసం చేశారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కురుపాం, ఎల్విన్‌పేట, నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న 22 సారా క్యాన్ల సారాను ధ్వంసం చేశారు. వాటితో పాటు సారా కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించి రూ.64,710లను వసూలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ, ఎల్విన్‌పేట, కురుపాం ఎస్సైలు బి.శివప్రసాద్, ఎస్.షణ్ముఖరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోకు నిప్పపెట్టిన దుండగులు



ఆహుతైన ఆటో

శృంగవరపుకోట: మండలంలోని శివరామరాజుపేట ఎస్సీ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోకు నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెలికాని ముత్యాలు ఎస్సీ కాలనీలో నివాసముంటున్నాడు. ఎప్పటిలాగానే ఆటో తిప్పి శనివారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేసుకుని ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతైందని బాధితుడు వాపోయాడు. పరిసరాల్లో ఉన్న ముత్యాలు తదతరులు మంటలు అదుపుచేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితంలేక పోయింది. దీనిపై ఎస్.కోట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

నాటక పోటీలకు ఆహ్వానం

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి జాతర సందర్భంగా మార్చి 17న ఉత్తరాంధ్రస్థాయి పౌరాణిక, జానపద, సాంఘిక నాటక పోటీలు రాజాంలో నిర్వహించనున్నామని సలాది వెంకటరమణ కళాపరిషత్ అధ్యక్షుడు తులసీదాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాటకాలకు సంబంధించి కట్ సీన్లపై పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 28లోగా తమ ఎంట్రీలను ఆర్నిపల్లి వెంకటినాయుడు, ఎస్‌వీఆర్ కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి, రాజాం పేరుతో పంపించాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 5వేలు, ద్వితీయ బహుమతి రూ. 4వేలు, తృతీయ బహుమతి రూ. 3వేలతోపాటు ప్రదర్శనా పారితోషికం రూ.వెయ్యి ఇవ్వనున్నామన్నారు. వివరాలకు 9441756874, 9491569723 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్నిపల్లి వెంకటినాయుడు, రంప జగదీశ్వరశర్మ పాల్గొన్నారు

ఆపద వేళ రక్షణ దిశగా..

- బటన్ నొక్కితే సత్వరమే పోలీసుల రక్షణ
- దిశయాప్‌కు పెరుగుతున్న ఆదరణ
- పెద్దసంఖ్యలో రిజిస్ట్రేషన్లు



పార్వతీపురం ప్రైవేట్ కళాశాలలో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేయించిన సిబ్బంది(ఫైల్)

జిల్లాలో దిశ యాప్ వివరాలు..	
రిజిస్ట్రేషన్‌లు	1,12,232
వచ్చిన కాల్స్	3490
కౌన్సెలింగ్‌లు	67
ఎఫ్‌ఐఆర్‌లు	10

పార్వతీపురంటౌన్: ఆపదలో చిక్కుకున్న మహిళలు సాయం కోరిన వెంటనే అక్కడికి పోలీసులు చేరుకుని రక్షణ కల్పించే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. అదే 'దిశ' మొబైల్ యాప్. మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ దిశ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌పై పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు యంత్రాంగం మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. యాప్‌ను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, మహిళా పోలీసులు తమ ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, వాణిజ్య సముదాయాలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద యాప్ పనితీరు? ఆపద సమయంలో ఎలా వినియోగించుకోవాలి? అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థినులు, యువతులు, మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి సెల్‌ఫోన్లలో



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

యాప్‌ను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,12,232 మంది యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అలాగే ఈ యాప్‌ను వినియోగించుకుని ఇప్పటికే పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు రక్షణ పొందారు. ఈ యాప్ దేశంలోనే అన్ని పోలీస్ ఎమర్జెన్సీ సర్వీసుల్లో బెస్ట్ అండ్ ఫాస్టెస్ట్ సర్వీస్‌గా నిలిచింది.

మహిళ ఫిర్యాదుతో తక్షణ చర్యలు

ఈ ఏడాది జూన్ 16 తేదీన కొంతమంది తెలియని వ్యక్తులు తన వెంటపడి తనపై దాడిచేశారని పార్వతీపురం పట్టణానికి చెందిన ఓ మహిళ దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసింది. తక్షణమే స్పందించిన కంట్రోల్ రూమ్ సిబ్బంది పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆ స్టేషన్ పోలీసుసిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఆకతాయిల అరెస్ట్

గుర్తుతెలియని వ్యక్తులు ప్రతిరోజూ తనను వేధిస్తున్నారని పార్వతీపురం మండలం చొక్కాపువానివలసకు చెందిన ఓ మహిళ గతేడాది నవంబర్ 26వ తేదీన రాత్రి దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసింది. తక్షణమే పార్వతీపురం రూరల్‌పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఓఎస్ సిబ్బంది సమాచారం అందించారు. దీంతో రూరల్ పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకుని వేధింపుల బారినుంచి ఆమెను రక్షించారు.

యాప్ పనితీరు ఇలా..

- దిశ ఎస్‌ఓఎస్ యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ సమయంలో మాత్రమే నెట్ అవసరం. ఆ తర్వాత నెట్ లేకపోయినప్పటికీ యాప్ పనిచేస్తుంది.
- వ్యక్తిగత వివరాలతో పాటు కుటుంబసభ్యులు, స్నేహితులకు సంబంధించిన ఐదు ఫోన్ నంబర్లను అందులో సేవ్ చేసుకోవాలి. ఆపదలో ఉన్నప్పుడు యాప్‌ను ఓపెన్‌చేసి అత్యవసర సహాయం(ఎస్‌ఓఎస్) బటన్ నొక్కాలి. బటన్ నొక్కే పరిస్థితి లేకపోతే ఫోన్‌ను వేగంగా అటూ ఇటూ ఊపితే ఫోన్ లొకేషన్ వివరాలు కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అదేక్రమంలో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కి బాధితుల వాయిస్‌తో పాటు అక్కడ జరిగే దృశ్యాలను పదిసెకన్ల నిడివి వరకు వీడియో తీసి పంపవచ్చు. దీంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని చర్యలు చేపడతారు.
- యాప్‌లోని ట్రాక్‌మై ట్రావెల్ ఆప్షన్ వినియోగిస్తే మీరు ప్రయాణిస్తున్న వాహనం మీ గమ్యానికి కాకుండా వేరే వైపు వెళ్తుంటే ఆ సమాచారం దిశ కంట్రోల్‌రూమ్‌తోపాటు ఫోన్‌లో నమోదైన ఐదు నంబర్లకు పంపి అప్రమత్తం చేస్తుంది.
- దగ్గరల్లోని మెటర్నటీ, ట్రామా కేర్ సెంటర్లు, ఇతర ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులు, ఫార్మసీలు తదితర వివరాలు దిశ ద్వారా తెలుసుకోవచ్చు.
- బాధితులు ఉన్న ప్రదేశానికి సమీప పోలీసుస్టేషన్, సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నావిగేషన్, పోలీసు డైరెక్టరీ, అత్యవసర సమయాల్లో ఫోన్ చేయాల్సిన నంబర్లు, సామాజిక మాధ్యమాలు, రోడ్డుభద్రత వంటి ఆప్షన్లు యాప్‌లో ఉన్నాయి. దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంలా నిలుస్తోంది.

యాప్‌ను విధిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి



ప్రతి మహిళ తన స్మార్ట్ ఫోన్‌లో దిశ యాప్‌ను విధిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద సమయంలో యాప్ ఆపన్న హస్తంలా పనిచేస్తుంది. ఆపదలో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కినా, ఫోన్‌ను అటూ ఇటూ ఊపినా నిమిషాల వ్యవధిలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్షిస్తారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది గృహిణిలు, ఉద్యోగినులు, యువతులు గృహహింస, అసభ్య దూషణలు, బ్లాక్ మెయిల్. లైంగిక వేధింపులపై యాప్ ద్వారా ఫిర్యాదు చేసి రక్షణ పొందారు.

– ఎస్.ఆర్.హర్షిత, దిశ డీఎస్పీ, పార్వతీపురం మన్యం జిల్లా.

గృహప్రవేశానికి సిద్ధం

- 1,056 టిడ్కో గృహాల ప్రారంభోత్సవం రేపు
- హాజరుకానున్న ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖమంత్రి పీడిక రాజన్నదొర కృషితో సాలూరు పట్టణంలోని గుమడాం సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు ప్రారంభోత్సవాలకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణలు మంగళవారం ఇళ్ల ప్రారంభోత్సవాలు చేపట్టి 1,056 మంది లబ్ధిదారుల సొంతింటి కల సాకారం చేయనున్నారు. సుమారు రూ.70.28 కోట్లతో ఈ ఇళ్ల నిర్మాణం పూర్తిచేశారు.

రాజన్నదొర విశేష కృషికి ఫలితం

2006లో రాజన్నదొర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజల అవసరాలకు స్థలం అవసరమని గుమడాం సమీపంలో కొంత స్థలాన్ని గుర్తించారు. ఆ స్థలంలోనే గత టీడీపీ ప్రభుత్వంలో రూ.12.57 కోట్లుతో కేవలం పునాదులు అంతకంటే తక్కువ దశలో ఇళ్ల నిర్మాణం చేపట్టి వదిలేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఈ నిర్మాణాలు వేగవంతం చేయడానికి విశేష కృషి చేశారు. ఇళ్ల నిర్మాణంతో పాటు ప్రజలకు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనతో పాటు మురుగునీరు శుద్ధి, విద్యుద్దీకరణ కోసం భగీరథ ప్రయత్నం చేశారు. తాగునీటికి, విద్యుత్ తదితర వసతులకు అడుగడుగడుగునా అవాంతరాలు ఎదురవుతుండగా వాటికోసం సంబంధిత



టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర (ఫైల్)

రాష్ట్రస్థాయి అధికారులతో రాజన్నదొర మాట్లాడి వాటన్నింటిని అధిగమించి పనులు పూర్తిచేయించారు. ఎప్పటికప్పుడు పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రజల సొంతింటి కలను రాజన్నదొర సాకారం చేయించారు.

రివర్స్ టెండరింగ్ ద్వారా..

కేవలం పునాదులు అంతకంటే తక్కువస్థాయి దశలో నిర్మాణంతో గత టీడీపీ ప్రభుత్వం విడిచిపెట్టిన సాలూరు టిడ్కో ఇళ్లకు రివర్స్‌టెండరింగ్ జరిగింది. 1 చదరపు అడుగు శ్లాబ్‌కు గత టీడీపీ ప్రభుత్వం రూ.2,200కు టెండర్లు పిలవగా , రివర్స్‌టెండరింగ్ ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ.1,700 కే టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టడం ద్వారా చదరపు అడుగు దగ్గర రూ.500 తగ్గింది. ఇంటి నిర్మాణం రూ.6 లక్షలు, స్థలం, సుమారు రూ.60 వేల విలువ చేసే రిజిస్ట్రేషన్ చార్జీలు ఉచితం చేసి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు లక్షలాది రుపాయలు ఖర్చు చేసి, ప్రతి ఇంటి ద్వారా సుమారు రూ.10 లక్షల ఆస్తిని ప్రతి లబ్ధిదారుకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోంది.

లబ్ధిదారుల కృతజ్ఞతలు

గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల లబ్ధిదారుల తలపై సుమారు రూ.7లక్షల అప్పు పెట్టాలని చూస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.10 లక్షల విలువైన మౌలిక వసతులతో కూడిన ఇళ్లను ఉచితంగా అందిస్తోందంటూ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మౌలిక వసతులతో కూడిన ఈ గృహాలను సిద్ధం చేయించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొరకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, గ్రూపుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి మల్లి(పీటీజీ-బాలురు0, జోగింపేట (బాలురు) విశాఖపట్నం(బాలికలు)కళాశాలల్లో జరగనున్న ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నామని జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు ఒక ప్రకటనలో కోరారు. అలాగే ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదేశాల మేరకు 2024-25 విద్యా సంవత్సరానికిగాను జోగింపేట (బాలురు), విశాఖపట్నం(బాలికలు)ప్రతిభా పాఠశాలల్లో 8వ తరగతిలో ప్రవేశానికి జరగబోయే పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన వారు, లక్షరూపాయల వార్షికాదాయం కంటే తక్కువ కలిగి, గిరిజన బాల,బాలికలై ఉండేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి అర్హులని పేర్కొన్నారు. దఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోడానికి ఆఖరు తేదీ 25.3.2024, అని ప్రవేశ పరీక్ష తేదీ 7.4.2024న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకూ జరుగుతుందని స్పష్టం చేశారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో లేదా గురుకులం వెబ్‌సైట్‌లో ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్.ఐఎన్‌లో సమర్పించి హాల్‌టికెట్ తీసుకోవాలని వివరించారు.

ఆధిక్యంలో కేరళ

- మొదటి ఇన్నింగ్స్‌లో 514/7 డిక్లేర్



184 పరుగులు చేసిన కేరళ బ్యాట్స్‌మన్ అక్షయ్ చంద్రన్



4 వికెట్లు దక్కించుకున్న ఆంధ్రా బౌలర్ మనీష్

విజయనగరం: కేరళ బ్యాట్స్‌మన్ అక్షయ చంద్రన్ 386 బంతుల్లో 184 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో ఆంధ్రా జట్టుతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో కేరళ జట్టు ఆధిక్యం సాధించింది. డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో మూడవ రోజు ఆదివారం 3 వికెట్లు నష్టపోయి 258 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడవ రోజు మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన కేరళ జట్టు బ్యాట్స్‌మెన్ అద్వితీయ బ్యాటింగ్ ప్రతిభ కనబరిచారు. మొత్తం 161.4 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి డిక్లేర్ ప్రకటించారు. జట్టు బ్యాటింగ్‌లో అక్షయ్ చంద్రన్ 184 పరుగులు, కెప్టెన్ సచిన్ బెబి 113 పరుగులు, సల్మాన్ నిజార్ 58 పరుగులు, రోషణ్ 61 పరుగులతో రాణించారు. ఆంధ్రా బౌలింగ్‌లో జి.మనీష్ 4 వికెట్లు, షోయబ్ మహ్మద్‌ఖాన్ 2 వికెట్లు, పీవీఎస్ ఎన్ రాజు 1 వికెట్ దక్కించుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా మూడవరోజు ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలో వికెట్ నష్టానికి 19 పరుగులు చేసింది. అంతకు ముందు మొదటి ఇన్నింగ్స్‌లో అతిథ్య ఆంధ్ర జట్టు 96.4 ఓవర్లలో 272 పరుగులు ఆలౌటైన విషయం విదితమే. నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 223 పరుగులు వెనుకబడి ఉంది.

జాకేరులో ఎడ్ల పరుగు ప్రదర్శన



పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో కేజేపురానికి చెందిన ఆంజనేయ స్వామి ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. గ్రామంలో మూడో రోజు నిర్వహించిన వీరాంజనేయ, చిన్నమ్మ పైడమ్మ తీర్థమహోత్సవం సందర్భంగా గ్రామసర్పంచ్ బుద్ధాచిన్నమ్ములు, అప్పలనాయుడు, గ్రామపెద్దల సమక్షంలో ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీల్లో 13 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వాటిలో ప్రథమస్థానంలో నిలిచిన కేజేపురం-2 ఎడ్లు రూ.పదిహేనువేలు, రెండోస్థానంలో నిలిచిన లక్కవరం సిద్ధివినాయక ఎడ్లకు రూ.12వేలు, మూడోస్థానంలో నిలిచిన వల్లంపూడి సిద్ధివినాయక ఎడ్లుకు రూ.పదివేలు, నాలుగో స్థానంలో నిలిచిన శ్రీ ఆంజనేయ కె.జెపురం-1 ఎడ్లకు రూ.ఎనిమిదివేలు, ఐదోస్థానంలో నిలిచిన గండివెంకటరావు వావిలపాడు ఎడ్లకు రూ.ఆరువేలు, ఆరోస్థానంలో నిలిచిన వల్లంపూడి శానాపతి నాయుడు ఎడ్లుకు రూ.నాలుగువేలు చొప్పున నగదు బహుమతులను గెలుచుకున్నాయి. ఈ బహుమతులను గ్రామపెద్దలు, కమిటీ మెంబర్లు విజేతలకు అందజేశారు.

కరాటేతో ఆత్మస్థైర్యం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందేందుకు కరాటే దోహదపడుతుందని రోటరీక్లబ్ మాజీ గవర్నర్ బీవీ అచ్యుత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సన్ స్కూల్ ఆవరణలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలను రాజాం పట్టణానికి చెందిన శివసైన్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో బాలురతోపాటు బాలికలు కూడా కరాటే నేర్చుకోవాలని సూచించారు. తద్వారా అత్యవసర సమయాల్లో ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పలు జిల్లాలకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభను నిరూపించుకున్నారు. కాటా, కుమిటీ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 100 మంది బంగారు పతకాలు, 70 మంది సిల్వర్, 120 మంది రజత పతకాలు దక్కించుకున్నారని కోచ్ ఆర్.శివ తెలిపారు. అన్ని విభాగాలకు సంబంధించి ఓవరాల్ చాంపియన్‌గా సన్ స్కూల్ నిలవగా ద్వితీయ స్థానంలో విశాఖ జిల్లాలోని వాడచీపురుపల్లి, తృతీయ స్థానాన్ని శ్రీకాకుళం జట్టు కై వసం చేసుకున్నాయని చెప్పారు.

విజేతలకు షీల్డ్‌లతోపాటు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మక్క అప్పలనాయుడు, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, గట్టి పాపారావు, 20 మంది కరాటే ఇనస్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాచిపెంట: మండలంలోని విశ్వనాథపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 9మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఈ దాడిలో పట్టుబడిన పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారి నుంచి రూ. 5,860 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పశువుల వ్యాన్ పట్టివేత



గోతిలో పశువుల కళేబరాలను పూడుస్తున్న పోలీసులు

- సుమారు 70 వరకు పశువుల కళేబరాల భాగాల గుర్తింపు
- ప్రజారోగ్యం దృష్ట్యా గోతిలో పూడ్చిపెట్టిన పోలీసులు

బొండపల్లి: మండలకేంద్రం మీదుగా వ్యాన్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న పశు కళేబరాల వివిధ భాగాలకు సంబంధించిన ఎముకలను పెద్దఎత్తున పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి అనంతరం చెరువులో వాటిని పూడ్చిపెట్టారు. ఈ సంఘనటకు సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి విజయనగరానికి అక్రమంగా సుమారు 70 పశువులకు పైగా కళేబరాల ఎముకలు, వ్యర్థాలను వ్యాన్‌లో తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు రోళ్లవాక జంక్షన్ వద్ద గల జాతీయ రహదారిపై తమ సిబ్బంది మాటు వేసి పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, పశువైద్యాధికారులతో పాటు బొండపల్లి సర్పంచ్ బొండపల్లి ఈశ్వర్రావు పాల్గొన్నారు. రెండు రోజుల క్రితం మృతిచెందిన పశువుల కళేబరాలుగా గుర్తించి పంచనామా నిర్వహించి పోలీసులతో కలిసి పూడ్చిపెట్టినట్లు బొండపల్లి పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ చెప్పారు.

వేతన బకాయిలు చెల్లించాలి

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఐఆర్, డీఏ, జీపీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ఎన్‌జీవో సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలువురు కోరారు. జిల్లాలోని అన్ని సంఘాల జేఏసీ భాగస్వామ్య పక్షాల సంఘం నాయకులు ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ ప్రస్తుత చైర్మన్ జీవీఆర్ఎస్ కిశోర్, కార్యదర్శి సురేష్, ప్రభూజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీవీరమణ ఏపీ ఎన్జీవో జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ప్రకటించేలోపు ఐఆర్ ఇవ్వాలి

- ఆపస్ జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: వేతన సవరణ కమిటీ నివేదిక ప్రకటించేముందు ఇంటెరిమ్ రిలీఫ్ ఫండ్ (ఐఆర్) వర్తింప చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం స్థానిక మహారాజా ప్రభుత్వ సంస్కృతోన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో సభ్యులు తీర్మానించారు. రాష్ట్రస్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చూపుతోందని ఇందుకు నిరసనగా ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రంలో నిరసన చేపడుతున్నామని ప్రకటించారు. వేతన ఎరియర్స్, జీపీఎఫ్/జెడ్‌పీపీఎస్, ఏపీజీఎల్ఐ, టీఏ/డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్, సీపీఎస్ వారికి చెల్లించాల్సిన 90 శాతం క్యాష్‌గా ఇవ్వాల్సిన ఎరియర్స్ వెంటనే చెల్లించాలని కార్యవర్గం డిమాండ్ చేసింది. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇజ్జిరోతు రామానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీజే సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు ఎస్‌వీఎస్‌కృష్ణారావు, కె.భాస్కరరావు, ఎం.వెంకటనాయుడు, రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.సంతోషలక్ష్మి, కార్యదర్శులు ఎ.కిరణ్‌కుమార్, కోశాధికారి ఏజీ తాతారావు, సభ్యులు పీవీఎల్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధానకార్యదర్శి వీవీజే సుబ్రహ్మణ్యం

ఎన్ఆర్‌సీని తనిఖీ చేసిన డీఎంఓ

పార్వతీపురం టౌన్: పోషకాహార పునరావాస కేంద్రం (ఎన్ఆర్‌సీ)ను జిల్లా ఆస్పత్రిలో జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అడ్మిట్ అయిన ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్య వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. పది పడకల ఎన్ఆర్‌సీలో ప్రతి నెలా జరుగుతున్న అడ్మిషన్లు, డిశ్చార్జ్‌ల వివరాలు చేర్చేటప్పుడు వారి బరువు, ఆరోగ్య స్థితి, డిశ్చార్జ్ అయ్యేనాటికి వారి బరువు, ఆరోగ్య స్థితి ఏ మేరకు మెరుగైనదీ పరిశీలించారు. వారికిస్తున్న పోషకాహార మెనూ పరిశీలించారు. ప్రతి బెడ్ వద్ద ఉన్న చిన్నారి ఆరోగ్యాన్ని పరిశీలించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. అక్కడ పిల్లల బరువుని స్వయంగా తనిఖీ చేశారు.

ఎన్ఆర్‌సీలో న్యూట్రిషన్ కౌన్సిలర్, వైద్యులు, వైద్య సిబ్బంది ప్రతీ రోజూ పర్యవేక్షిస్తూ, పిల్లల ఆరోగ్యం మెరుగుపడే వరకు (రెండు వారాల వరకు) ఉంచాలన్నారు. జిల్లాలో రెండు ఎన్ఆర్‌సీ కేంద్రాలున్నాయని రెండోది సీతంపేట, ప్రాంతీయ ఆస్పత్రిలో ఉందన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది ఆశాజ్యోతి, దివ్యతేజ ఉన్నారు.



ఎన్ఆర్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంఓ